
జ్ఞానోపదేశం
కె. భాను

సాయంత్రం మునిసిపల్ పార్కులో కూర్చున్నాను. పిల్లల కోలాహలం విపరీతంగా ఉంది. జారుడు బల్లలపైన, బ్యాలన్సింగ్ బారుల పైన పిల్లలు ఆడుతున్నారు; కేరింతలు కొడుతున్నారు. పార్కులోని పచ్చదనంలో సజీవ పుష్పాల్లా పిల్లలు చెంగలిస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూస్తున్న నాకు ఎంతో సంతోషంగా ఉంది.

అమాయికత్వం, చైతన్యం, ఉత్సాహం, ఉద్వేగం, ఆనందం స్పందన – ఆ ఎదిగే పువ్వు వంటి పిల్లల్లో కనబడుతుంటే గుండె పండుగ చేసుకొంటున్నది.

సిమెంటు బెంచిమీద కూర్చొని చూస్తున్న నేను అరగా కన్నులు మూసుకొన్నాను. బంగారపు సిరెండలో మెట్ట తామర పువ్వులు ఎర్రగా మండు తున్నట్లు కనబడుతున్నవి.

పార్కులోకి వస్తున్న నలుగురు స్టూడెంట్సు 'నమస్కారం సార్' అంటూ వెళ్ళారు.

పది నిముషాలైన తర్వాత ఇంకో గుంపు విద్యార్థులు వస్తూ 'గుడ్ ఈవినింగ్ సార్' అంటూ వెళ్ళారు ఉషారుగా.

విద్యార్థులు ప్రదర్శించిన ఈ గౌరవంవల్ల ఒక విధమైన గర్వరేఖ మనసులో పొటమరించిన మాట వాస్తవం!

నేను కూర్చున్న బెంచీ ప్రక్కన గడ్డిలో పండుకొని ఉన్న పన్నెండేళ్ళ కుర్రవాడు, స్టూడెంట్సు నాకు నమస్కారం చేస్తూ వెళ్తున్న దృశ్యాన్ని చూసి, కళ్ళు నులుముకొని నా ప్రక్కన వచ్చి కూర్చున్నాడు.

నల్ల నిక్కరు, గళ్ళ చొక్కా వేసుకొన్నాడు. హిప్పీ జుట్టు! పెద్ద కళ్ళు! నిద్ర నుండి లేచినందువల్ల కొంచెం ఎర్రగా వున్నాయ్. ఎదురుగా లోకాన్ని మర్చిపోయి ఆడుకొంటున్న పిల్లల ఈడువాడే! వాళ్ళు హాయిగా ఆడుకొంటుంటే వీడు నిద్ర నుంచి మేలుకొన్నాడు.

'ఏటండీ గురూగారూ! మీరేం జేస్తారు?' ఆ కుర్రోడు నన్ను ప్రశ్నించాడు.

'గురువుగారు' అనే మాట స్టేషన్ల దగ్గర, సినీమాహాళ్ళ దగ్గర, మట్కా కంపెనీల దగ్గర, హోటళ్ళ దగ్గర, సారా దుకాణాల దగ్గర, ముండల కంపెనీల దగ్గర సాధారణంగా వాడే పదం! ఒకప్పుడు నిజంగా ఎంతో విలువైన పదం! కాకపోతే ఇప్పుడు అడ్డమైన ప్రతి నాలుక మీద అడ్డదిడ్డంగా నడయాడుతున్న పదం అయ్యింది! అంతే తేడా!

'నువ్వేం చేస్తుంటావోయ్?' నేను అడిగాను.

'అదేటి గురూగారు! ముందు నేను అడిగాను గదూ?'

'అవుననుకో! నేను పెద్దవాణ్ణి గదా! నాకు ముందు జవాబు చెప్పు.'

'నిజమేననుకోండి ... ఇస్టూడెంట్సు కుర్రోళ్ళు ... పీస్ పాస్ మంటుంటే...యింగిలీసు బొమ్మల్లోలా ... మీరు పెద్దోళ్ళని అనుకున్నా లెండి ... అస్సలు ... యేం జెత్తారో .. తెలుసు కొందారని ... అడిగా.'

'సరేలేవోయ్ ... నేనే చెబుతా ... బస్సు స్టాండు దగ్గర కాలేజి వుంది చూశావా? దాన్లో పని చేస్తున్నాను.'

'బస్సు స్టేండింగ్ దగ్గరా? అవునండోయి... పెద్ద బిల్డింగ్సులు ... చూశా ... దాన్లో ఏం జేత్తారండీ మీరో...'

'జె. ఎల్ అంటే జూనియర్ లెక్చరర్‌గా పన్జేస్తున్నాను.'

'అంటే ... ఏటండీ గుర్రూగారు?'

'అంటే... స్టూడెంట్సుకు పాఠాలు జెప్పే ఉద్యోగం అన్నమాట... పదో తరగతి పాసై వచ్చే కుర్రాళ్ళకి పాఠాలు చెప్పాలి... పెద్దగా అరవాలి... అల్లరి చెయ్యకుండా చూడాలి... అర్థమయ్యేటట్లు చెప్పాలి... క్రమశిక్షణలో ఉంచాలి... అదన్నమాట ఉద్యోగం...'

'ఓస్ తెల్సిందిలెండి... అయితే... సరింగా... నా ఉజ్జోగం లాంటిదేనన్నమాట...' అన్నాడు మెరుస్తున్న కళ్ళతో.

'ఆఁ' అని ఆశ్చర్యంతో బెంచీకి చేరగిలబడ్డాను.

'ఏమిటోయ్... నువ్వు వెలగబెడుతున్న ఉద్యోగం?' పరిహాసంగా అడిగాను.

'మూడు సినేమా హాళ్ళు లేవూ... అదేనండి మాంట్గొమర్కెట్టు దగ్గర, గోరవ్పనపేటకెళ్ళే దారిలో హాళ్ళండీ... లఖ్మీటాకీస్ చూశారా? అక్కడ...' అని ఇంకా చెబుతుండగా –

'మాష్టారూ! మీకోసమే చూస్తున్నాం ... మీటింగ్ ప్రారంభమైంది ... బయలుదేరండి...' అని ఇద్దరు స్టూడెంట్సు వచ్చి నన్ను తొందర పెట్టారు. నేను లేచి ఆ కుర్రోణ్ణి చూస్తూ దగ్గరగా వున్న మీటింగ్ దగ్గరకు వెళ్ళాను. ఆ కుర్రోడేమిటి? ఉద్యోగం ... పైపెచ్చు నాలాంటి ఉద్యోగమట! మనసులో నవ్వుకొన్నాను.

వారంరోజులైంది. లక్ష్మీటాకీస్‌లో ఇంగ్లీష్ పిక్చర్ 'కింగ్ ఎలిఫెంట్' అనే సినీమాకి తీసుకొని వెళ్ళమని మా పిల్లలందరూ పోరుపెట్టారు. సరేనని తీసుకొనివెళ్ళాను.

ఇంటర్‌వెల్‌లో బైటకు వచ్చాను.

అఖండ దీపాల వెలుగులో, పెట్రోమాక్స్ లైట్ల కాంతిలో వేరుసెనక్కాయలు. బజ్జీ,పకోడి, మషాల మిక్చర్, స్వీట్లు అమ్ముతున్నదుకాణాలు!

సైకిల్ చక్రాల తోపుడు బండ్లమీద ఈ సరుకులు అమ్మేది ఒకడు; కొనమని అరిచేది ఇంకొకడు.

చాలా బండ్లున్నాయి. కాని ఒక బండి దగ్గర 'బజ్జీ, గరమ్ మషాల, పకోడి' అని కంచుగంటలా గొంతు వినబడుతున్నది. ఆ గొంతుకు ఆకర్షితులైన జనం, ఎక్కువగా అక్కడే మూగారు. నేనూ అక్కడికో నాలుగడుగులు వేశాను. జనం ఎక్కువగా వుండడంవల్ల ప్రక్కగా నిలబడ్డాను.

'అరవరా ... కొడకా! బేరాలు సరింగా రావటంలా ... అరువు పెద్దంగా...' అంటున్నాడు చెక చెక పాట్లాలు కడుతున్న మనిషి.

ఇంకా శ్రుతి హెచ్చించి అరుస్తున్నాడు. ఆ గొంతులో ఒక ఆకర్షణ! ఒక రంజకత్వం వుంది ఇంకో రెండు నిముషాల్లో ఇంకా జనం అక్కడే మూగారు. ముఖ్యంగా ఆ గొంతు విని; రెండోది కొనాలని.

'తోసుకోవద్దు బాబు! ... నరసగా తీస్కోండి ... జేబులు జాగ్రత్తండి ... బజ్జీ ... పకోడి ... కారబ్బూంది ... మషాల...' అని కుర్రవాడు రికార్డులా పెద్దగా అరుస్తున్నాడు. కొనేవాళ్ళను చూస్తూ, అజమాయిషీ చేస్తున్నాడు. వాడికి పన్నెండేళ్ళు వుండవచ్చు. కాని గంటలా అరుస్తూ, కుక్కలా పని చేస్తున్నాడు.

చటుక్కున నాకు వారంరోజుల క్రిందట మునిసిపల్ పార్కులో నాతో ముచ్చటించిన కుర్రోడు జ్ఞప్తికి వచ్చాడు. వెంటనే దగ్గరగా వెళ్ళి సునిశితంగా చూశాను. ఆ కుర్రవాడే! ఆనాటి మాటలు గిర్రున నా తలలో తిరిగాయి. మనసు చివుక్కుమంది!

నేను పిల్లలకోసం కారపుబూంది కొంటుండగా నన్ను గుర్తుపట్టి 'ఏం గుర్రూగారు! బాగున్నారా?' అన్నాడు. నేను నవ్వుతూ తల ఊపాను.

'మీ ఉద్యోగం లాంటిదే నా ఉద్యోగం' అన్న ఆ కుర్రవాడి మాటలు పదే పదే అలల్లాగ గుండెను తాకుతున్నవి.

ఎవరు ఏ ఉద్యోగం చేసినా, దానిమీద బాధ్యత, బరువు, మమకారం, గౌరవం పెంచుకొంటే తెల్లబట్టలు వేసుకొన్నా, నల్లబట్టలు తొడుక్కున్నా ఎక్కువ తక్కువ భావాలు వుండకూడదనే స్ఫురణ ఆ కుర్రవాడి మాటలమూలకంగా నాకు అవగతమైన పరమసత్యం! 'అరే! అదా మీ ఉద్యోగం' అని చిన్నచూపు చూసే చిన్నబుద్ధుల పెద్దవారి సంగతి వేరే విషయం!

ఒక విషమ సమస్య పరిష్కారం అయినంత ఆనందం కల్గింది. సామాన్య మానవుడికి జ్ఞానోపదేశం కల్గడానికి ఏ గుడిలోనో, గుహలోనో కూర్చోనక్కరలేదు. ఎదట వున్న మనుష్యుల మనుగడ గమనిస్తే చాలు అని అనుకొన్నాను.

'అవునన్నట్లు'గా సినిమాహాలులోని బెల్ మోగింది.

నేను ఆ కుర్రవాడిని చూస్తూ ముందుకు నడిచాను.

## దారేదీ?

పదువుతున్నా రోజూ 'వాంటెడ్' కాలమ్స్ –  
చావడానికూడా అనుభవమే కావాలంటాను,  
వయసు – పాతికేళ్ళ మించరాదంటార్,  
అనుభవమాత్రం–అయిదేళ్ళా కావాలంటార్!...  
ప్రకటనలో పెద్ద జీతమే రాస్తార్,  
ప్రయివేటుగా – ''డిపాజిట్'' కట్టమంటార్,  
అన్నీ అయ్యాక –  
ఇంకా ఉద్యోగం రాదేమయ్యా అంటే  
నీకా ఉద్యోగం ''రిజర్వుడు'' కాదు –  
పొమ్మంటార్!...  
ఇప్పుడు చెప్పండి –  
ఇంక ''ఉద్యోగం'' నాకెవడిస్తార్?  
నా జీవితానికో దారెవడు చూపిస్తార్!

– మరువాడ భానుమూర్తి